## క్లుప్తంగా

### కర్లపాలెం ఎంపీడీవోగా రాఘవేంద్రనాథ్



**కర్లపాలెం:** కర్లపాలెం ఎంపీడీవోగా రాఘవేంద్రనాథ్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన మంగళగిరి ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై కర్లపాలెం వచ్చారు. ఇప్పటి వరకు కర్లపాలెం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న నేతాజీ మంగళగిరికి బదిలీ అయ్యారు.

### ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



**కర్లపాలెం:** గ్రామ దేవత నాంచారమ్మ అమ్మవారి గుడి పునర్నిర్మాణం చేపట్టడం అభినందనీయమని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెంలో గురువారం జరిగిన గ్రామదేవత నాంచారమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపనలో ఎమ్మెల్సీ సతీష్ ప్రభాకర్ పాల్గొని భూమిపూజ చేశారు. గుడి నిర్మాణానికి రూ.5 లక్షల నగదు కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆలయంలో కేశ ఖండనశాల ప్రారంభం



**పొన్నూరు:** పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వర స్వామి, శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన కేశ ఖండనశాల, కార్య నిర్వహణ గదుల్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ నేత వట్టిప్రోలు రంగారావు పాల్గొన్నారు.

### యువతి అదృశ్యంపై కేసు నమోదు

**పెదకాకాని:** యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చందు అక్షయ గౌతమి ఫిబ్రవరి 26న ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువుల ఇంటి వద్ద విచారించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. అక్షయ గౌతమి తాతయ్య చెరుకూరి వెంకట ప్రసాదరావు మనుమరాలు అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం సీఐ కొమ్మనబోయిన వీరాస్వామి తెలిపారు.

### లాటరీ పేరుతో మోసం చేస్తున్న నలుగురిపై కేసు నమోదు

**గుంటూరు రూరల్:** లాటరీ పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్న నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గుంటూరు రూరల్ మండలం రెడ్డిపాలేనికి చెందిన కుంటిగొర్ల దిబ్బరాజు, కుంటిగొర్ల అంజి, క్రోసూరు నరసింహారావు, బిట్రా సాంబశివరావు తక్కువ రేటుకు సామాన్లు కొనుగోలు చేసి, మిర్చి యార్డు సమీపంలో వాటిని లాటరీలు తీస్తున్నారు. యాభై రూపాయలకు టికెట్‌ను ప్రజలకు విక్రయిస్తున్నారు. వాటిలో సున్నా నంబరు కార్డులు ఎక్కువగా ఉంచి, టికెట్లు కొనుగోలు చేసిన వారికి సామానులు రాకుండా మభ్య పెట్టి మోసం చేస్తూ, అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3వేలతో పాటు స్టీలు సామానులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లపాడు సీఐ రాంబాబు తెలిపారు.

### సైబర్ సెక్యూరిటీలో ఎథికల్ హ్యాకింగ్ పాత్ర ప్రత్యేకం



**పెదకాకాని:** సైబర్ సెక్యూరిటీలో ఎథికల్ హ్యాకింగ్ పాత్ర ప్రత్యేకమని సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్ షేక్ ప్రేమ్ నజీర్ తెలిపారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఐఈఈఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఎథికల్ హ్యాకింగ్‌పై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. విద్యార్థులకు వివిధ రకాల హ్యాకింగ్ టూల్స్‌పై షేక్ ప్రేమ్ నజీర్ అవగాహన కలిగించారు. హానికరం కాకుండా భద్రతను పరిరక్షించడానికి ఎథికల్ హ్యాకింగ్ విధానాన్ని అవలంబిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరావు, డీన్ ఆఫ్ అకడమిక్ కె. గిరిబాబు, సీఎస్‌ఈ విభాగాధిపతి ఎం.ఆర్. ఠాగూర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ పాలనలో ఇంటి ముంగిటకే వైద్యం

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- పాతనందాయపాలెంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం



మహిళకు ఇంటి స్థలం పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

**కర్లపాలెం:** వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లతో సీఎం జగన్ రాష్ట్ర ప్రజలకు ముంగిటకే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. కర్లపాలెం మండల పరిధిలోని పాతనందాయపాలెంలో రూ.22లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను గురువారం ఎమ్మెల్యే రఘుపతి శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభోత్సవం చేశారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ గవర్నర్ కోన ప్రభాకర్‌రావుల విగ్రహాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్థానిక జగనన్న కాలనీలో గతంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలందించేందుకు సీఎం చేస్తున్నారని చెప్పారు. గ్రామాలలో 104 వైద్య శిబిరాల ద్వారా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ వైద్యులు వారి ఇళ్లకే వెళ్లి వైద్య సేవలందించి ఉచితంగా మందులు అందజేస్తున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా రూ.25 లక్షల విలువైన వైద్యాన్ని వారికి నచ్చిన కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచితంగా చేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావూరి చిట్టెమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీటీసీలు తాండ్ర సాంబశివరావు, ఆసిఫ్ అలీ, కాగిత బుల్లియ్య, అమీర్‌బేగ్, పార్టీ నాయకులు కావూరి శ్రీనివాసరెడ్డి, ఆట్ల అయ్యప్పరెడ్డి, చీరాల సత్యనారాయణరెడ్డి, పరమానందకుమార్, కంకిపాటి నాగరాజు, ఆట్ల హరిబాబురెడ్డి, గొర్ల సుబ్బారావు, పోతురాజు వెంకటేశ్వరమ్మ, స్థల దాత తూనుగుంట్ల జగదీష్ కుమార్, డాక్టర్ గోపీనాథ్, ఎంపీడీవో రాఘవేంద్ర నాథ్, తహసీల్దార్ నిర్మలానందబాబా, కార్యదర్శి పద్మావతి తదితరులు ఉన్నారు.



హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

బలిజేపల్లికి చెందిన 21 కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానించిన ఇన్‌చార్జ్ అశోక్‌బాబు

**బలిజేపల్లి(వేమూరు):** వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 21 కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, కోగంటి లవ కుమార్ సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



వైఎస్సార్ సీపీలోకి చేరిన టీడీపీ కార్యకర్తలు

# విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో వేడుకగా సైన్స్ ఎగ్జిబిషన్

**చెరుకుపల్లి:** విద్యార్థులు చిన్నతనం నుంచే సైన్సు పట్ల మక్కువ పెంచుకొని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి సూచించారు. మండలంలోని పొన్నపల్లి ఐడీపీఎస్‌లో ఫిబ్రవరి 29న లీప్ డే సందర్భంగా స్పేస్ ఫెయిర్ మరియు మినీ నక్షత్ర శాల, రాకెట్ ప్రయోగం తదితర అంశాలతో కూడిన నమూనా ఎగ్జిబిషన్‌ను గురువారం పాఠశాలలో నిర్వహించారు. ముందుగా పలువురు శాస్త్ర వేత్తల చిత్ర పటాలకు పూల మాలలతో నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. నేటి సమాజంలో ప్రపంచాన్ని శాస్త్ర విజ్ఞానమే నడిపిస్తుందని వివరించారు. పాలపుంత, సౌర్య వ్యవస్థ, నక్షత్ర మండలాలు, మన దేశం ప్రయోగించిన వివిధ రాకెట్ నమూనాలు, ఉప గ్రహ నమూనాలతో పాటు అనేక రకాల వైజ్ఞానిక ప్రదర్శన నమూనాలను విద్యార్థులు తయారు చేశారు. వీటిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తిలకించారు. కార్యక్రమంలో ఐడీపీఎస్ వైస్ చైర్మన్ పైనం గణేష్ రెడ్డి, ప్రిన్సిపల్ నర్గీస్ క్వాజి, డైరెక్టర్ వారె ప్రసాద్ రెడ్డి, సుధా మాధవి, సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీలో నూతనోత్సాహం

**పొన్నూరు:** ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి విధేయుడు, సేవాతత్పరుడు, బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా పార్టీ అధిష్టానం నియమించడంతో పొన్నూరు వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ ముస్లిం నాయకులు షేక్ నాజర్ ఆధ్వర్యంలో బాణసంచా వెలుగులతో సంబరాలు ఘనంగా నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మురళీకృష్ణకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

**పార్టీ నేతల్లో ఐక్యత**

2019 ఎన్నికల తర్వాత చిన్న చిన్న విభేదాల కారణంగా నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు కొందరు పార్టీకి దూరంగా ఉంటున్నారు. కానీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తమ మధ్య వ్యక్తిగతంగా ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ పొన్నూరులో ప్రతిపక్ష టీడీపీకి తావివ్వకుండా ముందుకు సాగుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం అంబటిని ప్రకటించడంతో ఇన్నాళ్లు స్తబ్దతగా ఉన్న పార్టీ శ్రేణుల్లో ఐక్యత కనిపించింది. రానున్న ఎన్నికల్లో అంబటి మురళీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు సన్నద్ధమయ్యారు.

**మామిళ్లపల్లిలో కోలాహలం**

గురువారం నియోజకవర్గ పార్టీ శ్రేణులందరూ ఏకమై ఐకమత్యంగా అంబటి మురళీకృష్ణని కలిసేందుకు రావడంతో మామిళ్లపల్లి కోలాహలంగా మారింది. పొన్నూరు నుంచి గ్రామం వరకు నేతలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. పూల కిరీట ధారణ చేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

**పెదకాకానిలో..**

పొన్నూరు నియోజకవర్గానికి నూతన ఇన్‌చార్జిగా బజరంగ్ ఫౌండేషన్ చైర్మన్ అంబటి మురళీకృష్ణ పేరును పార్టీ అధిష్టానం ప్రకటించడంతో పెదకాకాని, నంబూరు గ్రామాల్లో సంబరాలు అంబరాన్ని అంటాయి. కొంతకాలంగా నియోజకవర్గం ఇన్‌చార్జి పేరు ప్రకటించడంపై ఉత్కంఠ నెలకొని ఉంది. అంబటి మురళీకృష్ణ పేరును ఖరారు చేయడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం ఉప్పొంగిపోయింది. గురువారం ఉదయం మామిళ్లపల్లిలోని అంబటి నివాసానికి నాయకులు చేరుకుని అభినందనలు తెలియజేశారు. బొకేలు, పూలమాలలు, స్వీట్లు పంపిణీ చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. మామిళ్లపల్లిలో అంబటి మురళీకృష్ణను కలసిన వారిలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, పెదకాకాని సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గుజ్జుల సుమతి, ఎంపీటీసీ సభ్యులు షేక్ గుల్జార్, షేక్ షహనాజ్, మాతంగి నిర్మల, నంబూరు ఎంపీటీసీ సభ్యులు షేక్ అబ్దుల్ లతీఫ్, దాసరి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు ఉన్నారు.



అంబటి మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, నాజర్ తదితరులు

**నియోజకవర్గంలో జోష్**

**చేబ్రోలు:** పొన్నూరు సమన్వయకర్తగా అంబటి మురళీకృష్ణను ప్రకటించటంపై గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన అంబటి మురళీకృష్ణ ఇప్పటికే పొన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందారు. సమన్వయకర్తగా అంబటి మురళీకృష్ణ ప్రకటించటంతో పొన్నూరు పట్టణం, రూరల్, పెదకాకాని, చేబ్రోలు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మామిళ్లపల్లిలోని అంబటి మురళీకృష్ణను కలిసి అభినందనలు తెలిపారు. చేబ్రోలు, కొత్తరెడ్డిపాలెం, మంచాల, వేజండ్ల, వడ్లమూడి, కలశపాడు తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులు టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

### నేడు తాగునీటి పథకానికి భూమిపూజ

**రేపల్లె రూరల్:** మండలంలోని గంగడిపాలెం పంచాయతీ మృత్యుంజయపాలెం గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.8 కోట్లతో ఏర్పాటు చేయనున్న తాగునీటి పథకానికి నేడు భూమిపూజ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణా రావు, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌లు కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు.

### గ్రామాల్లో 'సిద్ధం' సమావేశాలు

**వలివేరు(వేమూరు):** సార్వత్రిక ఎన్నికలకు తామంతా సిద్ధంగా ఉన్నామని జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య అన్నారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామ సచివాలయం వద్ద బూత్ కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. చుండూరు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో మేము సిద్ధం బూత్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందిపాటి ఏసు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గాదె శివరామకృష్ణా రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అమర్తలూరు ప్రవీణ్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**తెనాలిరూరల్:** నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు, సిబ్బంది గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి నుండి 22 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

### ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

**తెనాలిరూరల్:** ఎనిమిదో తరగతి విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్‌కు చెందిన దమ్ము హెప్సిబారతి(13) ఐతానగర్ హైస్కూలులో ఎనిమిదో తరగతి చదువుతోంది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పనికి వెళ్లిన తండ్రి రాజు ఇంటికి వచ్చి చూడగా బాలిక ఉరికి వేలాడుతూ కనబడింది. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

### అత్తోటలో బీజేపీ ప్రజాపోరు యాత్ర

**కొల్లిపర:** మండలంలోని అత్తోట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వివిధ సెంటర్‌లలో బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు, రైతుల సంక్షేమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక పథకాలు ప్రవేశ పెడుతున్నారని తెలిపారు. పీఎం కిసాన్ యోజన కింద రైతులకు కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో రూ.2వేలు జమ చేస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ముద్రించిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌లను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాపోరు కో కన్వీనర్ కొవ్వూరి శ్రీనివాసరావు, మండల బీజేపీ అధ్యక్షుడు మునగా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు అశ్విన్, రామిరెడ్డి, దావులూరు గ్రామ అధ్యక్షుడు మణికంఠ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

### 119 మంది విద్యార్థులకు టీసీఎస్‌లో ఉద్యోగాలు

**గుంటూరు రూరల్:** టీసీఎస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ కళాశాలకు చెందిన 119 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం హర్షణీయమని ఆర్‌వీఆర్ జేసీ కళాశాల అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం వారితో పాటు ఎంసీఏ విద్యార్థులకు గురువారం కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. తొలి దశలో అత్యధిక ప్యాకేజీతో 119 మంది ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల్ని గురువారం కళాశాలలో సెక్రటరీ, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, సిబ్బంది అభినందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ క్యాంపస్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 401 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలోని అగ్ర దేశాల్లో ఆర్థిక మాంద్యం నెలకొనడంతో ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ తమ కళాశాల విద్యార్థులకు అవకాశాలు రావడం వారి ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. వివిధ బ్రాంచిల్లోని ఏడుగురు విద్యార్థులకు ప్రైమ్ రోల్‌లో రూ. 9 లక్షలు, డిజిటల్ రోల్‌లో రూ. 7లక్షల ప్యాకేజీతో 57 మంది విద్యార్థులు, నిన్జా రోల్‌లో రూ. 3.5లక్షల ప్యాకేజీతో 55 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ వివరించారు.

# పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కండి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



**రేపల్లె రూరల్:** పట్టణ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ కోరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటి అభివృద్ధిలో పాలుపంచు కోవాలన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశామన్నారు. నిరంతరం డ్రెయిన్‌లలో పూడికతో పాటు రహదారుల వెంబడి చెత్తను తొలగింప జేసేందుకు అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. తాగునీటి సమస్య నెలకొనే వార్డులలో ట్యాంకర్‌ల ద్వారా తాగునీటిని పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. పట్టణంలో ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. పట్టణంలో పలు వార్డులకు అత్యవసర పనుల నిమిత్తం రూ.47.40 లక్షలు కేటాయించామన్నారు. వీటితో తాగునీటి పైపు లైన్‌లతో పాటు సీసీ డ్రెయిన్‌లు, రహదారుల నిర్మాణాలకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. అనంతరం ఏజెండాలోని 27 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత నూతనంగా బాధ్యత లు చేపట్టిన కమిషనర్ శేషాద్రి, నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యురాలు డొక్కు జానకీదేవిలకు కౌన్సిల్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, కమిషనర్ శేషాద్రి, ఏఈ రోహిణి, అధికారులు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.

# సేవలతోనే ఉద్యోగి జీవితానికి సంతృప్తి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్


**బాపట్లటౌన్:** పోలీస్‌శాఖలో ఉద్యోగం పొందినప్పటి నుంచి పదవీ విరమణ వరకు సుదీర్ఘ కాలం విశిష్ట సేవలు అందించిన ఘనత వి.సీతారామ నాయుడికే దక్కిందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన ఆయనను గురువారం ఎస్పీ వకుల్‌జిందాల్ ఘనంగా సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదన్నారు. ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంతోనే సాధ్యమన్నారు. అలాంటి ఉద్యోగంలో చేరడం గొప్ప అదృష్టంగా భావించాలన్నారు. కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో ప్రవేశించి సుమారు 41 సంవత్సరాల పాటు విశేష సేవలు అందించారని సీతారామనాయుడిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ వి.మల్లికార్జునరావు, వెల్ఫేర్ ఆర్ఐ డి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఎస్సైను సన్మానిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

# భావన్నారాయణుని ఆలయానికి పర్యాటక గుర్తింపు

**బాపట్ల:** చారిత్రక ప్రసిద్ధి పొందిన బాపట్ల శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయానికి రాష్ట్ర పర్యాటక శాఖ గుర్తింపు లభించడం హర్షణీయమని బాపట్ల జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిమ్మన శ్యామ్‌సుందర్ తెలిపారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలలో భాగంగా తొలి దశలోనే బాపట్ల ఆలయానికి ప్రత్యేక టూర్ ప్యాకేజీ లభించడంతో బాపట్ల ప్రజ ల చిరకాల వాంఛ నెరవేరినట్లయిందని ఆయన పేర్కొన్నారు. క్రీస్తు శకం 594వ సంవత్సరంలో క్రిమికంఠ చోళ మహారాజుచే నిర్మించబడిన 1400 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రగల ఈ ఆలయం తీరాంధ్రప్రదేశ్ లోనే తొలి వైష్ణవాలయం అన్నారు. మధ్యయుగంలో ఎన్నో విదేశీ దాడులను ఎదు ర్కొని అలనాటి తన ప్రాభవాన్ని నేటికీ కోల్పోకుండా ఈ ఆలయం నిలిచిందని ఆయన తెలిపారు. భక్తులు ఆలయాలను ఎటువంటి వ్యయ ప్రయాసలకు లోను కాకుండా దర్శించుకునే విధంగా దేవదాయ పర్యాటక శాఖ సంయుక్తంగా రూట్ మ్యాప్‌ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.



భావన్నారాయణ స్వామి దేవాలయం

# సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

**పెసర్లంక(భట్టిప్రోలు):** జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని గీతాయంగ్ సైంటిస్ట్ స్వామినాథన్ ట్రస్ట్ (చీరాల) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో భట్టిప్రోలు మండలం పెసర్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలను 9వ తరగతి చదువుతున్న టి. సుహిత, ఈ లాస్యలు సాధించారు. హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ క్విజ్‌లో 6 టీంలు పాల్గొనగా ఎం.భవ్యశ్రీ,, టి.సుహిత టీమ్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. పోటీలను మండల సైన్స్ కోఆర్డినేటర్ అంబటి జాకబ్ పర్యవేక్షించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. సర్పంచ్ వేములపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె మహబూబ్‌భాషా, స్థానిక పెద్దలు గుజ్జర్లమూడి రాజు, తదితరులు పాల్గొన్నారు. విశ్వశాంతి విద్యార్థులను కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ప్రధానోపాధ్యాయులు ఫణి పార్థసారధిలు అభినందించారు.

# వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

**అద్దేపల్లి(భట్టిప్రోలు):** భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామంలోని వేణుగోపాలస్వామి వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ హనుమత్ లక్ష్మణ సీతా సమేత శ్రీరామచంద్రస్వామి వారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. విగ్రహాలను దాతలు వేల్పూరి శ్రీనివాసరావు, కనకారావు, బాల సుబ్రహ్మణ్యం, నారాయణరావు, నాగేశ్వరరావులు అందించారు. పూజా కార్యక్రమాలు వైదికుడు పరాశరం విజితేంద్ర ఆధ్వర్యంలో దీవి నాగ శేషాచార్యులు నేతృత్వంలో శాస్త్రోక్తంగా జరిగాయి. శ్రీ సీతారామ కాపు సేవా సంఘం నిర్వాహకులు పర్యవేక్షించారు. స్వామి వార్లను వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు సతీమణి దర్శించుకుని పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

# ఉపాధ్యాయినికి సన్మానం

**పెనుగుదురుపాడు(వేమూరు):** చుండూరు మండలంలోని పెనుగుదురుపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయిని తేళ్ల పాల్‌రాజ్ సన్మాన కార్యక్రమాన్ని గురువారం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి ఆర్ చలపతిరావు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో తేళ్ల పాల్‌రాజ్ 37 సంవత్సరాలు కొనసాగారన్నారు. అనేక మంది విద్యార్థులకు విద్యను అందించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి మదాసు సలోమన్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు